# సారథి లేని విద్యాశాఖ

తొలిరోజు హాజరుపై అమావాస్య దెబ్బ
పర్యవేక్షణ కొరవడిన ప్రభుత్వ విద్య



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ విద్యాశాఖ పరిస్థితి రౌతులేని గుర్రంలా తయారైంది. ఇప్పటికే ఆదరణ కోల్పోయి కునారిల్లుతున్న ప్రభుత్వ విద్య ఇప్పుడు మరిన్ని ఇబ్బందులను ఎదుర్కొంటుంది. ఉమ్మడిజిల్లా పరిధిలోని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు విద్యాశాఖాధికారులు లేరు. ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారి సెలవుపై వెళ్లారు. గతంలో 15 రోజులపాటు సెలవుపై వెళ్లిన జిల్లా విద్యాశాఖాధికారి ఈనెల నాలుగున ఉద్యోగ బాధ్యతల్లో చేరి తిరిగి మరో రెండు నెలల పాటు సెలవుపై వెళ్లారు. దీనితో ప్రభుత్వ బడులపై పర్యవేక్షణ కొరవడింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల సంఖ్య, పాఠ్యపుస్తకాల పంపిణీ, ఇతర మౌలిక వసతులు, ఉపాధ్యాయుల హాజరు అన్నింటికి మించి మధ్యాహ్న భోజనం తదితర వాటిని పర్యవేక్షించే వారు కరువయ్యారు. ఇక విద్యార్థుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను నియమించాల్సిన విద్యాశాఖాధికారి లేకపోవడంతో ఇప్పుడు క్రమబద్ధీకరణ కూడా జరిగే పరిస్థితి లేదు. విద్యార్థులు ఉన్నచోట ఉపాధ్యాయులు లేక ఉపాధ్యాయులు ఉన్న చోట విద్యార్థులు లేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఖమ్మం జిల్లా విద్యాశాఖాధికారిగా గతంలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. ఉపాధ్యాయుల పని విధానం, బోధన తదితర విషయాలపై ఆమె ప్రత్యేక దృష్టిసారించడం తరచూ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును పరిశీలించడం చేసేవారు. నిరంతర పర్యవేక్షణతో విద్యాశాఖ గాడిన పడుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్న సమయంలో వృత్తిపట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించి దండనకు గురైన వారు శ్రీజ ఇన్‌చార్జిగా ఉంటే తమ ఆటలు సాగవని భావించిన కొందరు ఉపాధ్యాయులు తమ సంఘాల ద్వారా పైరవీ ప్రారంభించారు. ఖమ్మంలో మంత్రులతో ప్రారంభమైన పైరవీ సచివాలయం వరకు సాగింది. చివరకు ఓ రెగ్యులర్ విద్యాశాఖాధికారిణిగా చైతన్యజైనిని నియమించారు. ఆమెకు జిల్లా పట్ల అవగాహన లేకపోవడంతో ఇబ్బందులు పడి వృత్తిని సరైన రీతిలో నిర్వహించలేదన్న ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఉన్నతాధికారుల మందలింపా, వ్యక్తిగత కారణాలో తెలియదు కానీ రెండు నెలల పాటు సెలవుపై వెళ్లినట్లు సమాచారం. ఇప్పుడు మళ్లీ గతమే పునరావృతమైంది. పాఠశాలల పునః ప్రారంభం ముందు జిల్లా విద్యాశాఖాధికారి లేకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. తొలి రోజు అన్ని పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలను పంపిణీ చేశారు.

**ప్రైవేటుకు సంకెళ్లేవి :** జిల్లా విద్యాశాఖాధికారి లేకపోవడంతో ప్రైవేటుకు అడ్డు అదుపు లేకుండాపోయింది. అసలు జిల్లాలో ఎన్ని ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి, ఎన్ని పాఠశాలలకు అనుమతులు ఉన్నాయి, ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి ఎన్ని పాఠశాలలు పనిచేస్తున్నాయి అనే దానిపై అడిగే నాథుడే లేడు. బహుళ అంతస్తుల పైభాగాల్లో ఎల్‌కెజి, యుకెజి తరగతులు నిర్వహిస్తున్నారు. కనీస రక్షణ చర్యలు లేవు. ప్రభుత్వ పరంగా నిబంధనలకు లోబడి వసతుల కల్పన జరగడం లేదు. ముఖ్యంగా కార్పొరేట్ విద్యా సంస్థల వైపు కన్నెత్తి చూడడం లేదు. దీనితో ప్రైవేటు విద్యా సంస్థలది ఆడింది ఆటగా పాడింది పాటగా తయారైంది. అసలు అర్హత కలిగిన బోధనా సిబ్బంది ఉన్నారా లేరా అని పర్యవేక్షించే వారే లేరు. అర్హత కలిగిన ప్రైవేటు ఉపాధ్యాయుడు ఒక్కరే రెండు మూడు పాఠశాలల్లో బోధిస్తున్నట్లుగా చూపుతున్నారంటే విద్యాశాఖ తీరు ఏవిధంగా ఉందో అవగతమవుతుంది. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క ఖమ్మం కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా విద్యాశాఖపై సమీక్ష నిర్వహించి జిల్లా ఉన్నతాధికారుల సాక్షిగా నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని వాటికి ఈ విద్యా సంవత్సరం నుంచి అనుమతులు ఇవ్వవద్దని హెచ్చరించినా జిల్లా విద్యాశాఖ ఏ ఒక్క ప్రైవేటు విద్యా సంస్థను సందర్శించి కనీస చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.

**కొత్తగూడెంలోనూ అదే పరిస్థితి :**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ జిల్లా విద్యాశాఖాధికారి లేరు. వాసంతి జిల్లా విద్యాశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించి వెంటనే సెలవుపై వెళ్లారు. రాష్ట్రంలోనే అత్యధిక ఏజెన్సీ ప్రాంతం కలిగిన కొత్తగూడెంకు విద్యాశాఖాధికారి లేకపోవడం ఇబ్బందికరంగా మారింది.

**హాజరుపై అమావాస్య ప్రభావం :**
పాఠశాలలు పునఃప్రారంభమైన సోమవారం అమావాస్య కావడంతో విద్యార్థుల హాజరు శాతం గణనీయంగా తగ్గింది. ఖమ్మం జిల్లాలో మొత్తంగా కేవలం 13.29 శాతం హాజరు నమోదైంది. ఇందులో అత్యధికంగా ఎర్రుపాలెం మండలంలో 57 ప్రభుత్వపాఠశాలలకు గాను 29.8 శాతం హాజరు కాగా ఇక జిల్లాలో మొత్తం 1279 పాఠశాలల్లో ఏ పాఠశాలలోనూ 20 శాతానికి మించ లేదు. అతి స్వల్పంగా ముదిగొండ మండలంలో 57 ప్రభుత్వ పాఠశాలలకు గాను 8.18 శాతం హాజరు మాత్రమే నమోదైంది. రేపు మంగళవారం కావడంతో బుధవారం నుంచి విద్యార్థుల హాజరు శాతం పెరిగే అవకాశం ఉంది. ఖమ్మం అర్బన్, తిరుమలాయపాలెం, ఏన్కూరు మండలాల్లో 10 శాతం మంది విద్యార్థులు కూడా హాజరు కాకపోవడం గమనార్హం.

## టెట్ పరీక్షకు సర్వం సిద్ధం

ఐదు రోజుల పాటు పరీక్ష
జిల్లా కలెక్టర్ అంకిత్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నేటి జిల్లాలో నిర్వహించనున్న టెట్ పరీక్షకు సర్వం సిద్ధంగా ఉన్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. 16వ తేది నుండి మొదలుకుని 22వ తేది వరకు మొత్తం ఐదు రోజుల పాటు పదివిడతల్లో ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. జిల్లా మొత్తంగా 1217 మంది అభ్యర్థులు టెట్ పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. పరీక్షల నిర్వహణ కోసం పాల్వంచ అనుబోస్ కాలేజీని పరీక్షా కేంద్రంగా ఎంపిక చేశామన్నారు. అభ్యర్థుల సౌకర్యార్థం విద్యుత్, ఇంటర్నెట్, తాగునీరు, భద్రతా ఏర్పాట్లు చేశామని చెప్పారు. పరీక్షా సమయానికి ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని, హాల్‌టిక్కెట్‌తో పాటు సంబంధిత గుర్తింపు కార్డును తీసుకురావాలని సూచించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని, అభ్యర్థులు పరీక్షా నిబంధనలు తప్పకుండా పాటించాలని కలెక్టర్ సూచించారు.



## అర్హులకు పథకాలు అందేలా యూనిట్ అధికారులు చర్యలు తీసుకోవాలి

ఎపిఒ జనరల్ డేవిడ్ రాజ్

**ప్రజాపక్షం/భద్రాచలం :** అర్హులైన గిరిజనులకు ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న పథకాలు అందేలా యూనిట్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ ఎపిఒ జరల్ డేవిడ్ రాజ్ తెలిపారు. సోమవారం ఐటిడిఎ సమావేశ మందిరంలో నిర్వహించి గిరిజన దర్బారుకు హాజరైన ఆయన పలు గిరిజన గ్రామాల నుండి తరలొచ్చిన గిరిజన ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా విన్నపాల పరిశీలించిన ఆయన వివిధ శాఖల అధికారులకు పంపించారు. అనంతరం ఎపిఒ మాట్లాడుతూ గిరిజన ప్రజల మేలు కోసం ఏర్పాటు చేసిన ఐటిడిఎల్లో పనిచేసే సిబ్బంది గిరిజనాభివృద్ధికి పాటుపడాలని, వినతులు స్పష్టంగా పరిశీలించిన అనంతరం అర్హులైన ప్రతీ ఒక్కరికీ పథకాలు చేరేలా కృషి చేయాలన్నారు. పరిష్కారానికి నోచుకోని వాటిపై సమగ్రంగా నివేదికలు అందించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా యూనిట్ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## తాత్కాలిక సర్వీస్‌రోడ్డు

ప్రజాపక్షం కథనానికి స్పందన

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మం నగరానికి తలమానికంగా నిర్మాణం జరుగుతున్న కేబుల్ బ్రిడ్జితో నెలలుగా వాహనదారులు, జలగంనగర్‌నాయుడుపేటవాసులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రజాపక్షం దినపత్రిక ప్రచురించిన కథనానికి సంబంధిత అధికారులు స్పందించారు. ప్రజల సమస్యను గుర్తించి తక్షణ చర్యలకు ఉపక్రమించారు. ఈ క్రమంలో జలగంనగర్ వైపు నుంచి బ్రిడ్జి కిందుగా కాల్వొడు వైపు వెళ్లేందుకు రెండు తాత్కాలిక సర్వీస్ రోడ్డలను ఏర్పాటు చేశారు. ఇందులో ఒక మార్గం ద్వారా ప్రస్తుతం వాహనాల రాకపోకలు కొనసాగుతుండగా, మరో మార్గాన్ని మున్నేటి పాత వంతెనకు అనుసంధానం చేసే పనులు కొనసాగుతున్నాయి. అక్కడ అసరమైన చిన్నపాటి మరమ్మతులు చేపడుతున్నారు. ఈ చర్యలతో జలగంనగర్ ప్రాంత ప్రజలకు కొంతమేరకు ట్రాఫిక్ ఉపశమనం లభించినట్లు స్థానికులు చెబుతున్నారు. మున్నేటి పాత బ్రిడ్జి వైపు చేపడుతున్న సర్వీస్‌రోడ్డు పనులు పూర్తయితే నాయుడుపేట ప్రజల రాకపోకల సమస్యకు కూడా పూర్తి స్థాయిలో పరిష్కారం లభించే అవకాశం ఉంది. నెలలుగా వాహన రాకపోకల ఇబ్బందులతో ఇబ్బంది పడుతున్న ప్రజల సమస్యను వెలుగులోకి తీసుకువచ్చి అధికార యంత్రాంగాన్ని కదిలించిన ప్రజాపక్షం దినపత్రికకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర మరోసారి స్పష్టమైందని అభిప్రాయపడ్డారు.



## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎమ్మెల్యే శ్రీకారం

రూ.41.50లక్షలతో పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి

**ప్రజాపక్షం/అశ్వారావుపేట:** పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యముగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తోందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు సైతం కార్పోరేట్ విద్యాసంస్థలకు ధీటుగా తగు చర్యలు తీసుకుంటున్నామని, వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పున:ప్రారంభించిన నేపథ్యంలో ఆయన విద్యార్థులకు స్వాగతం పలికి, పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసి స్వాగతం పలికారు. అనంతరం విద్యార్థులతో కలిసి అల్పాహారం చేసి, ప్రభుత్వం అందించే ఉచిత ప్రయోజనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్రమంలో ఆయన రూ.37.50లక్షలతో నిర్మించిన ప్రహరీని ప్రారంభించారు. అనంతరం మద్దులమడ జీపీఎస్ పాఠశాలలో చేపట్టిన మరమ్మత్తుల పనులను, దిబ్బగూడెం పాఠశాలలో రూ.4లక్షల వ్యయంతో నిర్మించిన ఆధునిక మరుగుదొడ్లను ప్రారంభించారు. పాఠశాల అభివృద్ధికి, తరగతుల మరమ్మత్తులు, విద్యార్థులకు అవసరమైన సౌకర్యాల కల్పనకై ప్రభుత్వం నిరంతరం నిధులు కేటాయిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మండల అధికారులు, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సింగరేణిలో ఎప్పుడైనా సమ్మెకు సై

గుర్తింపు సంఘం హెచ్చరిక



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** సింగరేణి కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించకుంటే సంస్థను స్తంభింపజేసే స్థాయిలో ఆందోళన చేపడతామని, 22 తర్వాత ఎప్పుడైన సమ్మె సైరన్ మోగే అవకాశముందని, కార్మికులంతా సిద్ధంగా ఉండాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటియూసి) అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య అన్నారు. సోమవారం పివికే 5 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. కార్మికులు సహనాన్ని యాజమాన్యం బలహీనంగా భావించడం సరికాదన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న మెడికల్ బోర్డు కేసులు, మారు పేర్లు, ఇన్‌కంటాక్స్, సొంతింటి స్థలం కేటాయింపు, డిపెండెంట్ ఉద్యోగాలు వంటి సమస్యల పరిష్కారంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. మెడికల్ ఫిట్ అయిన డిపెండెంట్లకు నియామకపు ఉత్తర్వులు జారీ కావడం వర్కర్స్ యూనియన్ పోరాట ఫలితమే అన్నారు. కార్మికులంతా ఐఖ్యంగా ఉండే మరిన్ని విజయాలు సాధించుకోవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సింగరేణికి చెల్లించాల్సిన రూ.56 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కొత్త కోల్ బ్లాక్ లు కేటాయింపు, కొత్త గనుల ప్రారంభం, సంస్థ విస్తరణతో పాటు భవిష్యత్ తరాల వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించే చర్యలు చేపట్టాలన్నారు. యూనియన్‌తో జరిగిన సమావేశాల్లో అంగీకరించిన డిమాండ్ల అమలు కాక పోవడానికి రాజకీయ జోక్యమే కారణమని ఆరోపించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం మొండి వైఖరి కొనసాగిస్తే సంగరేణి వ్యాప్తంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని, అవసరమైతే నిరవధిక సమ్మెకు కూడా వెనుకాడబోమని మిర్యాల స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కార్యదర్శి వి మల్లిఖార్జునరావు, కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, ఉపాధ్యక్షులు కత్తెర్ల రాములు, సహాయ కార్యదర్శి గట్టయ్యతో పాటు పలువురు యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



## ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోండి

ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఎఐఎస్‌ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ లేని బస్సులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ విద్యా సంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలకు సంబంధించిన బస్సులు తప్పనిసరిగా ఫిట్‌నెస్ చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కాలం చెల్లిన బస్సులతో విద్యార్థులను పరిమితికి మించి ఎక్కిస్తున్న ఆర్టీవో అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప వాటిపై చర్యలు తీసుకోకుండా ధ్వంద వైఖరిని ప్రదర్శిస్తున్నారన్నారు. బస్సు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలని కోరారు. ఫిట్‌నెస్ లేని వాహనాల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించి బస్సులు నడపడం వల్ల విద్యార్థులు ప్రమాదాల భారీన పడుతున్నారన్నారు. స్కూల్ బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, ఇన్సూరెన్స్, కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్స్‌తో పాటు ప్రతి బస్సులో క్లినర్, ఆయాలు ఉండేవిధంగా ఆర్టీవో అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలపై తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిట్‌నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పవన్, వెంకట్, రాము, రాంబాబు, గోపి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలప్పుడే రాజకీయాలు.. అభివృద్ధే నా ఎజెండా

ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/పినపాక :** ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉంటాయని, ఆ తర్వాత ప్రజల అభివృద్ధి, సంక్షేమమే తన ఎజెండా అని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం పినపాక మండలం ఏడూళ్లబయ్యారం క్రాస్ రోడ్డు జీవిఆర్ గార్డెన్‌లో జరిగిన కార్యక్రమంలో 30 మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు, 23 మందికి రూ.10లక్షల విలువైన సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో జెండాలు చూడొద్దని, అర్హతే ప్రామాణికమని అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పక్షపాతం, డబ్బుల వసూళ్లు జరిగితే సొంత పార్టీవారినైనా ఉపేక్షించబోనని హెచ్చరించారు. లబ్దిదారులకు అన్యాయం జరిగితే నేరుగా తమను కలిసి ఫిర్యాదు చేయాలని సూచించారు. చింతలబయ్యారం శైవక్షేత్రంలో గోదావరి పుష్కరాల కోసం పుష్కరఘాట్, వ్యవసాయ భూముల కోసం లిఫ్ట్ ఏర్పాటుకు అనుమతులు కోరామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.



**సీతంపేటలో రూ.16లక్షల సిసి రోడ్లకు శంకుస్థాపన :** సీతంపేట గ్రామ పంచాయతీ పరిధిలో ఎస్సీ, బిసి కాలనీల్లో రూ .16లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. అలాగే రూ.2.5లక్షలతో పునర్నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించారు. గ్రామంలో పెండింగ్‌లో ఉన్న రోడ్లను త్వరలో పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఎంపిడిఓ సంకీర్త్, ఎంపిఓ శ్రీనివాసరావు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రామనాథం, గ్రామపంచాయతీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## ఉపాధిహామీ పనులు పరిశీలించిన కలెక్టర్

అధికారులపై ఆగ్రహం

**ప్రజాపక్షం/వైరా :** వైరా మండలం స్నానాల లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను జిల్లా కలెక్టర్ దివాకర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఉపాధి పని కూలీలతో మాట్లాడుతూ వసతులు ఏ విధంగా ఉన్నాయి అని అడిగి తెలుసుకున్నారు. పనిచేసే వద్ద రోజు టెంట్, వాటర్, హెల్త్ కిట్లు ఏర్పాటు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నేను చెప్పింది ఏమిటి? మీరు చేసేది ఏమిటి అంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ చేస్తున్న పని కాదు కదా నేను అడిగింది అని ఏపివో అనురాధను అడగడంతో ఖానాపురంలో నడుస్తుంది అని సమాధానం చెప్పడంతో, ఖానాపురం వెళ్దాం పదండి అని కలెక్టర్ అనడంతో ఒక్కసారిగా వారిలో ఆందోళన ప్రారంభమైంది. పక్కకు వెళ్లి ఫీల్డ్ అసిస్టెంట్‌కు ఫోన్ చేయడం ప్రారంభించారు. ఉపాధి కూలీలతో మాట్లాడుతూ పని దినాలు ఏ విధంగా ఉన్నాయి హాజరు ఏ విధంగా నమోదు చేస్తున్నారు అని అడగడంతో సెల్‌ఫోన్‌లో యాప్ చూపించి మాస్టర్ చూపించారు. పనులు వద్ద ఏదైనా సమస్య ఉంటే ధైర్యంగా చెప్పండి, ఎవరు భయపడవద్దు అని కలెక్టర్ సూచించారు. ఉపాధి పని దినాల వద్ద అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలి, నిర్లక్ష్యం చేయవద్దు అని సంబంధిత అధికారులను కలెక్టర్ మందలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సక్రియ, తహశీల్దార్ సురేష్, విద్యుత్‌శాఖ వై.రమేష్, ఐబి డిఈ నాగబ్రహ్మం, గ్రామ సర్పంచ్ నూతి వెంకటేశ్వరరావు, మల్లు రామకృష్ణ, అనురాధ, పలువురు ఉపాధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/ఏన్కూరు :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదిన వేడుకలను కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏన్కూరులో ఘనంగా నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రిగా భట్టి విక్రమార్క రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి విశేష సేవలందరిస్తున్నారని కొనియాడారు. ఆయన మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, ఎఎంసి చైర్మన్ గుగులోత్ లచ్చిరామ్‌నాయక్, మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్ర కుమార్, జిల్లా నాయకులు సామేలు, ప్రభావతిరెడ్డి, మాజీ ఎఎంసి చైర్మన్ భూక్యా లాలూ నాయక్, మాజీ ఎంపిటిసి ధర్మారావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మల నాగేశ్వరరావు, చందమామ నరసింహారావు, మాలోతు నరసింహారావు, కనిశెట్టి వెంకన్న, గుర్రం రవి, పులబాల నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.



### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే దంపతులు

**ప్రజాపక్షం/సత్తుపల్లి :** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం సత్తుపల్లి పట్టణంలోని ద్వారకాపురి కాలనీలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సత్తుపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి ముఖ్య అతిథిగా హాజరై కేక్ కట్ చేసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకలకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రిహానా బేగం కమల్ పాషా, వైస్ చైర్మన్ బొంతు సుమలత వేణు, సత్తుపల్లి ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భీమిరెడ్డి సుబ్బారెడ్డి, కౌన్సిలర్లు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహారావు,నాగళ్ళ ప్రసాద్, గోపాలరావు, సామ్యూల్, రామ్మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

## ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

పరిపాలన అంశాలు సమీక్షించిన కలెక్టర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి ఫిర్యాదును సకాలంలో పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్లు పి.శ్రీజ, పి. శ్రీనివాసరెడ్డిలతో కలిసి జిల్లా అధికారులతో వివిధ పరిపాలన అంశాలపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రైవేటు భవనాల్లో నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యుత్ బిల్లులకు సంబంధించిన సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజావాణికి ఒకే దరఖాస్తుదారుడు పలుమార్లు రావాల్సిన పరిస్థితి రాకుండా చూడాలని, సమస్య పరిష్కారం కాని పక్షంలో అందుకు గల కారణాలను స్పష్టంగా వివరించి సమాధానం అందించాలన్నారు. ప్రతి అధికారి తన ఆధీనంలోని సిబ్బందిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తమ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలన్నారు. ఏ జిల్లా అధికారి కూడా ప్రజావాణికి గైర్హాజరు కావద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ఫారస్ కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ రామ్మూర్తి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం



ప్రజాపక్షం/మెదక్ : మెదక్ పట్టణంలోని పలు వార్డుల్లో రూ.2.70 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజు,వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, మున్సిపల్ కమిషనర్ నవీన్, ఆయా వార్డుల కౌన్సిలర్లతో కలిసి శంకుస్థాపన చేశారు. పట్టణంలోని 10, 11, 13, ,14, 15, 24, 27 వార్డుల్లో సిసి రోడ్లు, డ్రైయిన్లు, స్లాబుల నిర్మాణం, తాగునీటి సదుపాయాల కల్పనకు సంబంధించిన పనులను ప్రారంభించారు. ముఖ్యంగా 13వ వార్డు కౌన్సిలర్ సంధ్య నవీన్ కుమార్ ఆధ్వర్యంలో రూ.1.06 కోట్లతో చేపట్టనున్న పనులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అదే విధంగా 3వ వార్డులో ఎంఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మూడు తాగునీటి బోరు మోటార్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. మెదక్ పట్టణాన్ని ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని, ప్రతి వార్డుకు సమాన ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమాల్లో డిఇ సత్యనారాయణ తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, మహిళలు, యువత, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో యువతి మృతి

ప్రజాపక్షం / వాంకిడి : మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మొబైల్ ఫోన్ ఛార్జింగ్ పెడుతున్న సమయంలో విద్యుదాఘాతానికి గురై నాగొసె మహేశ్వరి (20) అనే యువతి శనివారం సాయంత్రం మృతి చెందింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన మహేశ్వరి తన నివాసంలో మొబైల్ ఫోన్‌కు ఛార్జింగ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై స్పృహ తప్పి కుప్పకూలింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను వాంకిడి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. యువతి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేశారు. అనంతరం అక్కడికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. కుమార్తె ఆకస్మిక మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతురాలి తండ్రి మొహర్లె రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై మహేందర్ తెలిపారు.

## కామారెడ్డిలో బిఎల్ఎ, ఎస్ఐఆర్ మ్యాపింగ్ 90 శాతం పూర్తి



ప్రజాపక్షం/నిజాంసాగర్: కామారెడ్డి జిల్లాలో బిఎల్ఎ, ఎస్ఐఆర్ మ్యాపింగ్ 90 శాతం పూర్తి అయిందని, ఇది కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయి బలోపేతానికి నిదర్శనమని కామారెడ్డి జిల్లా డిసిసి అధ్యక్షుడు ఏలె మల్లిఖార్జున్ స్పష్టం చేశారు. నిజాంసాగర్ మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మల్లిఖార్జున్ మాట్లాడారు. పార్టీ అదిష్ఠానం నిర్ధేశించిన లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మిగిలిన పనులను వేగవంతంగా పూర్తిచేసి ప్రతీ బూత్ స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో పార్టీ సంస్థాగత బలోపేతానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వెల్లడించారు.

## ప్రజావాణిలో 62 ఫిర్యాదులు



ప్రజాపక్షం /సంగారెడ్డి : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులు,వినతులను సమగ్రంగా పరిశీలించి త్వరతగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంగీతతో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ప్రజల నుంచి ఫిర్యాదులను,వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ఫిర్యాదులను సంబందిత శాఖలకు పంపించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని వివిధ డివిజన్లు, కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమాల్లో మొ త్తం 62 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు, సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు ,రెవెన్యూ అధికారులు మున్సిపల కమిషనర్లు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## వన్య ప్రాణులను వేటాడితే శిక్షార్హులు

అటవీ సెక్షన్ అధికారి మల్లేశం



ప్రజాపక్షం/కొల్చారం : భవిష్యత్ తరాల కోసం అడవులను పరిరక్షించడం మనందరి భాద్యత అని కొల్చారం అటవీ సెక్షన్ అధికారి మల్లేశం స్పష్టం చేశారు. సోమవారం మండల పరిధిలోని చిన్నా ఘనపూర్ గ్రామంలో అడవుల సంరక్షణపై సెక్షన్ అధికారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవులు మన పర్యావరణానికి, ఆర్థిక వ్యవస్థకు ఎంతో అవసరమన్నారు. వాటిని సంరక్షించడం చాలా ముఖ్యం అని తెలిపారు. అటవీ సంరక్షణలో భాగంగా అడవులను నరికివేయకుండా, చెట్లను నాటడం, అడవులను రక్షించడం, అటవీ ఉత్పత్తులను సరిగ్గా ఉపయోగించడం వంటివి చేయాలన్నారు. అడవులు గాలిని శుద్ధి చేసి, వర్షపాతాన్ని పెంపొందిస్తాయని, మట్టి కోతను నివారించి, వన్యప్రాణులకు ఆవాసాలను అందిస్తాయన్నారు. అటవీ భూమిని ఇతర అవసరాలకు ఉపయోగించకుండా చూడాలన్నారు. కొత్త చెట్లను నాటడం, పాత అడవులను పునరుద్ధరించడంతో కలప, ఇతర అటవీ ఉత్పత్తులను అవసరానికి మించి వాడకుండా ఉండాలన్నారు. అటవీ సంరక్షణకు సంబంధించిన చట్టాలను గౌరవించి వాటిని పాటించాలన్నారు. అటవీ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడం, బోరు బావులు తవ్వడం, తనుమతి లేకుండా అటవీలోకి ప్రవేశించి చెట్లను కొమ్మలు నరకటం వన్య ప్రాణాలను వేటాడం వంటివి చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోని కేసులు నమోదు చేస్తామని తెలిపారు. అవగాహనాలో బిట్ ఆఫీసర్లు గబ్బర్ సింగ్, ధనలక్ష్మి , రైతులు ప్రజలు ఉన్నారు.

# పంటల మార్పిడితోనే.. రైతులకు అధిక లాభాలు

ఎమ్మెల్యే పాల్వాయి హరీష్





ప్రజాపక్షం / కాగజ్ నగర్ : రైతులందరూ పంటల మార్పిడి విధానాన్ని అవలంబించి, అంతర పంటల సాగు ద్వారా అదనపు ఆదాయం పొందాలని సిర్పూర్ ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు సూచించారు. కాగజ్ నగర్ మండలంలోని వంజిరి గ్రామ రైతు వేదికలో జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు నాణ్యమైన వరి, కంది విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. రైతులకు మేలు చేసేందుకు నాణ్యమైన విత్తనాలను అందిస్తున్నామని, వాటిని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈసారి కొటాల, కాగజ్ నగర్ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా లక్ష బస్తాల మక్కలను సేకరించామని, దీనివల్ల రైతులకు మంచి లాభం చేకూరిందని తెలిపారు. రైతుల సమస్యల పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ ముందుండి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జల్ జీవిక స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ పద్మాకర్, ఎడిఎ మనోహర్, ఎఇ రామకృష్ణ, సర్పంచ్ గౌత్రే లక్ష్మి, ఉప సర్పంచ్ డోంగ్రే భరత్, పిఎసిఎస్ చైర్మన్ ఉమా మహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

### అర్హులందరికీ సంక్షేమ పథకాలు..

ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారునికి పారదర్శకంగా అందిస్తున్నామని ఎమ్మెల్యే డా. పాల్వాయి హరీష్ బాబు అన్నారు. కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం 239 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల అమలులో ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా ప్రభుత్వం అందించే ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మధుకర్, సర్పంచ్‌లు కుందారపు సుమన్, గజ్జి లింగయ్య, జాదవ్ రాజేందర్, కొండగుర్ల ప్రకాష్, కోట వేణు, పుల్ల అశోక్, దోతుల శ్రీనివాస్, ఫిర్సింగుల తిరుపతి, గణపతి, పెంటయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

## స్కేటింగ్ విజేతలను అభినందించిన ఎమ్మెల్యే



ప్రజాపక్షం/నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లా వేదికగా జరిగిన అస్మితా ఉమెన్స్ సిటీ స్కేటింగ్ లీగ్ పోటీల్లో ప్రతిభ చాటిన బోథ్ నియోజకవర్గ క్రీడాకారిణులను సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన నివాసంలో అభినందించారు. అండర్16 విభాగంలో బంగారు పతకం సాధించిన బోరిగాం తండాకు చెందిన విద్యా భారతి, రేసింగ్ విభాగంలో బంగారు పతకం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికైన సోనాల మండలానికి చెందిన సుష్మలను ఆయన ప్రత్యేకంగా శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా ఎల్లప్పుడూ చేయూత అందిస్తామని భరోసా ఇచ్చారు. క్రీడాకారిణులు మరింత కష్టపడి రాష్ట్రం గర్వించదగ్గ స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఐఎస్ కోచ్, జిల్లా స్కేటింగ్ సెక్రటరీ పాండు జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ షాక్; రైతు మృతి

ప్రజాపక్షం/కొల్చారం : మండల పరిధిలోని వరిగుంతం గ్రామానికి చెందిన రైతు కురుమ పోచయ్య(49) సోమవారం ఉదయం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. వ్యవసాయ పొలంలో బోర్ స్టార్టర్ ఆన్ చేసే సమయంలో స్టార్టర్ బాక్స్‌లోని వైరు తగలడంతో ప్రమాదం జరిగినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆహ్మద్ మోహినోద్దీన్ తెలిపారు. మృతుడికి భర్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోచయ్య మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## సింగరేణి కార్మికులకు అండగా హెచ్‌ఎంఎస్, టిఆర్ఎస్

కల్వకుంట్ల కవిత



ప్రజాపక్షం / కాసిపేట : సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం టిఆర్ఎస్, హెచ్‌ఎంఎస్ సంఘాలు నిరంతరం పోరాడుతాయని తెలంగాణ రాష్ట్ర సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. టిఆర్ఎస్ పార్టీ చేపట్టిన 'బాయి బాట' కార్యక్రమంలో భాగంగా సోమవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 1వ గనిని హెచ్‌ఎంఎస్ నాయకులు రియాజ్ అహ్మద్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గనిపై కార్మికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాలసీలు చేయాల్సిన సిఎం, డిప్యూటీ సిఎంలే వినతి పత్రాలు ఇస్తూ సింగరేణి కార్మికులను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాలతో సహా అన్ని విషయాల్లో సింగరేణి కార్మికులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో కార్మికుల పాత్ర కీలకమైందని, వారి సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భ ద్ర త, వేతనాలు, ఇతర సౌకర్యాలకు సంబంధించిన అంశాలపై యాజమాన్యం సానుకూలంగా స్పం దించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బోడ జనార్ధన్, వేముగంటి రవీందర్, కాసిపేట మండల పార్టీ అధ్యక్షుడు సురేష్, హెచ్‌ఎంఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## నీట్ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

కలెక్టర్ రాజర్షిషా



ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్: 21న నిర్వహించనున్న నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షను జిల్లాలో అత్యంత పకడ్బందీగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎస్‌పి అఖిల్ మహాజన్‌తో కలిసి ఆయన సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నీట్ పరీక్ష విద్యార్థుల భవిష్యత్తుతో కూడుకున్నదని, ఏ చిన్న పొరపాటుకు తావులేకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి కేంద్రం వద్ద ఏఎన్‌ఎంలు, అవసరమైన మం దులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లతో కూడిన మెడికల్ క్యాంపును ఏర్పాటు చేయాలని ఆరోగ్య శాఖను ఆదేశించారు. విద్యార్థుల సౌకర్యార్థం అదనపు ఆర్టీసీ బస్సులను నడపాలని సూచించారు. ఎస్‌పి అఖిల్ మహాజన్ మాట్లాడుతూ, పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని తెలిపా రు. విద్యార్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, ఉట్నూర్ ఆర్‌డిఓ మోహ న్ సింగ్, ఎఒ వర్ణ, విద్యా, వైద్య, రెవెన్యూ, పోలీస్ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన



ప్రజాపక్షం / దిలావర్‌పూర్ : మండల సమగ్రాభివృద్దే లక్ష్యంగా పలు కార్యక్రమాలకు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, ప్రజా సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మండలంలోని ఒడ్డెపలిలో రూ.10 లక్షలతో ప్రైమరీ స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి శంకుస్థాపన, లోలం గ్రామంలో రూ. 40 లక్షలతో ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సిస్టం నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలో రూ. 50 లక్షలతో ఐదు మహిళా సాధికారక భవనాలు బి.ఒ. భవనాల నిర్మాణానికి, రూ.50 లక్షలతో ఐదు బి.ఒ. వర్క్‌షెడ్‌ల నిర్మాణానికి, రూ. 36 లక్షలతో మూడు అంగన్వాడీ భవనాల నిర్మాణానికి, రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ. 10 లక్షలతో ప్రైమరీ స్కూల్ కాంపౌండ్ , కెజిబివి అదనపు తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

### రైతు వేదికలో అధికారులకు వార్నింగ్

మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ప్రజలతో నేరుగా మమేకమయ్యారు. రైతు వేదిక భవనంలో ఉన్న గ్రామ ప్రజలను పిలిచి వారి సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, పెన్షన్లు విద్యుత్ , రైతుల సమస్యలపై వినతులు వెల్లువెత్తాయి. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సభా వేదికపైనే ఉన్న ఎంపిడిఓ , తహసిల్దార్, ఇతర శాఖల అధికారులను ఉద్దేశించి గట్టిగా హెచ్చరించారు. ప్రజా సమస్యలు చెప్పారంటే పరిష్కారం కోసమే ఒక్కో సమస్యకు వారం రోజుల్లో స్పష్టమైన పరిష్కారం చూపాలి. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు అని అధికారులను హెచ్చరించారు. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు.

### కార్యకర్తల కుటుంబాలకు పరమార్శ

అభివృద్ధి కార్యక్రమాల అనంతరం బిజెఎల్పీ నేత హోదాలో మహేశ్వర్‌రెడ్డి ఇటీవలే మరణించిన పార్టీ కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులకు పార్టీ అండగా ఉంటుందని, అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

## మొక్కలు నాటడం సామాజిక బాధ్యత

31.96 లక్షల మొక్కలు నాటాలి: కలెక్టర్ ప్రతిమా సింగ్




ప్రజాపక్షం/మెదక్ : మొక్కలు నాటడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, మెదక్ జిల్లాలో 18 నుంచి ప్రారంభమయ్యే వనమహోత్సవ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ నగేష్, డిఆర్ఓ అంబాదాస్ రాజేశ్వర్, డిఎఫ్ఓ జోజి తో కలిసి కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో 31.95 లక్షల మొక్కలు నాటే లక్ష్యంతో చర్యలు చేపట్టాలని సూచించారు. రామాయంపేట మండలం అక్కన్నపేట గ్రామంలోని నగర్ వన్ యోజన పార్కులో 18న వనమహోత్సవ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని అన్ని కార్యాలయాలు పరిశుభ్రంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## చాతలో కార్డన్ సెర్చ్

ప్రజాపక్షం / భైంసా : కుబీర్ మండలం చాత గ్రామంలో కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా అనుమతులు లేకుండా నడుపుతున్న 92 ద్విచక్రవాహనాలు, ఒక ఆటోను స్వాదీనం చేసుకొని, సంబంధిత నిబంధనల ప్రకారం జరిమానాలు విధించడమైనది. ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపిఎస్ మాట్లాడుతూ సైబర్ నేరాలు, ట్రాఫిక్ సమస్యలు, నిషేదిత మత్తు పదార్థాల వినియోగం, మొబైల్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం, మైనర్ల చేత వాహనాల నడపడం వంటి సామాజిక మలినతలపై విపులంగా వివరణ నిచ్చారు. అలాగే ఆస్తి సంబంధ నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకం అని స్పష్టంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ ఐపిఎస్‌తో పాటు, భైంసా రూరల్ ఇన్స్‌పెక్టర్ ప్రవీణ్ కుమార్, కుబీర్ ఎస్ఐ కృష్ణరెడ్డి, కుంటాల ఎస్.ఐ. అశోక్, పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కారం: కలెక్టర్ దీపక్



ప్రజాపక్షం / నస్పూర్ : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సోమవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్‌లతో కలిసి ఆయన అర్జీదారుల నుండి దరఖాస్తులను స్వీకరించారు.అంతకుముందు నస్పూర్ మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందర్శించి భోజనశాల, అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైనందున విద్యార్థులకు నోటు పుస్తకాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులను అందజేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాలను పకడ్బందీగా అమలు చేస్తూ మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సర్పంచ్, కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలి

ప్రజావాణిలో కలెక్టర్‌కు బాధితురాలు వినతి



ప్రజాపక్షం/పాపన్నపేట: మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని కుర్తివాడ గ్రామానికి చెందిన ఆర్. సంధ్య భర్త ఆర్. నవీన్‌కు ఇందిరమ్మ పథకం కింద ఇల్లు మంజూరైంది. అయితే ఆర్థిక స్థోమత లేకపోవడంతో గ్రామ పెద్దల సూచన మేరకు ఇంటి నిర్మాణ బాధ్యతలను ఒక కాంట్రాక్టర్‌కు అప్పగించినట్లు బాధితురాలు సంధ్య తెలిపారు. కాంట్రాక్టర్ మొదట బేస్‌మెంట్ స్థాయి వరకు నిర్మాణ పనులు పూర్తి చేసినప్పటికీ, అనంతరం నిర్మాణ సామగ్రి సరఫరా నిలిపివేసి పనులను అర్ధాంతరంగా ఆపివేశాడని ఆమె ఆరోపించారు. నిర్మాణ పనులు ఎందుకు నిలిపివేశారని కాంట్రాక్టర్‌ను ప్రశ్నించగా, గ్రామ సర్పంచ్ శ్రీధర్ సూచన మేరకే పనులు ఆపివేశామని సమాధానం ఇచ్చినట్లు సంధ్య పేర్కొన్నారు. గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో తమ కుటుంబం తనకు ఓటు వేయలేదనే కక్షతో ఇంటి నిర్మాణాన్ని నిలిపివేశారని ఆరోపించారు. ఈ విషయమై పలుమార్లు కాంట్రాక్టర్‌ను సంప్రదించినా సర్పంచ్‌ను కలవాలని సూచించారని, అనంతరం సర్పంచ్‌ను కలిసి సమస్య వివరించగా తనను గెలిపించిన 30 మంది అనుమతి ఇస్తేనే ఇంటి నిర్మాణం కొనసాగిస్తానని చెప్పినట్లు సంధ్య తెలిపారు. అంతేకాకుండా పదేపదే తన ఇంటికి రావద్దంటూ హెచ్చరించినట్లు ఆరోపించారు. ఇప్పటికే బేస్‌మెంట్ పనులు పూర్తవడంతో సంబంధిత బిల్లును కాంట్రాక్టర్‌కు చెల్లించినట్లు బాధితురాలు వెల్లడించారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి, తమ ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా జోక్యం చేసుకోవాలని కోరారు. అలాగే ఇంటి నిర్మాణాన్ని నిలిపివేసిన సర్పంచ్‌పై తగిన చర్యలు తీసుకోవడంతో పాటు కాంట్రాక్టర్ ద్వారా పెండింగ్ పనులను పూర్తి చేయించి బిల్లులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. తమ కుటుంబ పరిస్థితిని పరిగణనలోకి తీసుకొని అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాన్ని తిరిగి ప్రారంభించి పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను బాధితురాలు సంధ్య వేడుకున్నారు.

### బాధితురాలికి న్యాయం చేయాలి

**మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి**

ఈ సమస్యపై మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మా దేవేందర్ రెడ్డి స్పందించారు. బాధితురాలు సంధ్య ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకున్న పద్మదేవేందర్ రెడ్డి ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను వివరించారు. ఇందిరమ్మ పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా వెంటనే విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. అర్హులైన లబ్ధిదారులు ప్రభుత్వ పథకాల ఫలాలను పొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. సమస్యను త్వరితగతిన పరిష్కరించి,బాధిత కుటుంబానికి ఇల్లు నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు.

## అక్రమ పాఠశాలలు సీజ్ చేయాలి

అనుమతిలేని పాఠశాలలపై చర్యలు తీసుకుని డిఇఒ, ఎంఇఒలను తొలగించాలి : విద్యార్థి సంఘాలు



ప్రజాపక్షం/నిజామాబాద్ : జిల్లావ్యాప్తంగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవటంలో జిల్లా విద్యాధికారి, మండల విద్యాధికారులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపిస్తూ ఎస్‌ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, ఎఐపిఎస్‌యు, డిఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల జిల్లా కమిటీల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఛాంబర్ ముట్టడించారు. సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ గత రెండు నెలలుగా అనుమతి లేని పాఠశాలల వివరాలను జిల్లా విద్యాధికారుల దృష్టికి తీసుకెళుతున్నప్పటికీ, కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితమై ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడాల్సిన విద్యాశాఖ అధికారులే ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ము కాస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. జిల్లాలో అనేక పాఠశాలలు అనుమతులు లేకుండానే అడ్మిషన్ ఫుల్ అంటూ బోర్డులు ఏర్పాటు చేసి విద్యార్థులను ఆకర్షిస్తున్నప్పటికీ వాటిపై చర్యలు తీసుకోవటంలో అధికారులు విఫలం అయ్యాయన్నారు. డిఇఒకు వాస్తవాలను తెలియజేయకుండా కొందరు ఎంఇఒలు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. అనుమతి లేని పాఠశాలలను వెంటనే సీజ్ చేయాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన డిఇఒ సంబందిత ఎంఇఒలపై శాఖాపరమైన చర్యలు తీసుకుని వారిని విధుల నుంచి తొలగించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు విఘ్నేష్, రఘురాం, అనిల్, జీవన్, సుబోద్, గోపాల్‌సింగ్ ఠాగూర్, కుశాల్, రాజు, చక్రి, సునీల్, శివ, వినీత్, రాహుల్ పాల్గొన్నారు.

